RNI No. TELTEL/2023/85185

# తెలంగాణ గవాక్షం

సమస్త సమాచార వీక్షణం | సాయంకాలం దినపత్రిక

Website: www.gawaksham.com Mobile: 9849 444 181, 8686 666 222 E-mail: editor@gawaksham.com

తెలంగాణ | శనివారం | 24-01-2026 | సంపుటి : 03 | సంచిక : 101 | పేజీలు : 8 | వెల : 3/-



# ఓ పనైపోయింది!



**అడిగిన ప్రశ్నలకు బదులిచ్చా..**

సిట్ విచారణకు పూర్తిగా సహకరించినట్లు కేటీఆర్ పేర్కొన్నారు. వాళ్లు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పినట్లు తెలిపారు. కొన్ని ప్రశ్నలు తాను కూడా సిట్ అధికారులకు వేసినట్లు చెప్పారు. విచారణ పేరిట ఎందుకు

మిగతా 2వ పేజీలో...

- ఎంక్వయిరీకి ఎప్పుడు పిలుస్తారో అ టెన్షన్‌కు తెర
- విచారణకు హాజరైన బీఆర్ఎస్ ఉపనేత కేటీఆర్
- ఏడు గంటలపాటు పలు ప్రశ్నలు వేసినట్లు ప్రచారం
- సంబంధం లేని ప్రశ్నలు అడిగినట్లు కేటీఆర్ వెల్లడి
- కొన్ని విషయాల్లో సిట్ అధికారులనే ప్రశ్నించినట్లు స్పష్టం
- ఎట్టకేలకు గులాబీ శ్రేణుల్లో తొలగిన ఉత్కంఠ, ఆందోళన

**హైదరాబాద్, గవాక్షం :**

ఫోన్ ట్యాపింగ్ కేసు ఏడాదిన్నరగా కొనసాగుతూనే ఉంది. ఇప్పటికే ఈ కేసులో అనుమానితులను సిట్ అధికారులు పలు మార్లు విచారించారు. రెండు రోజుల క్రితం బీఆర్ఎస్ మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు సైతం విచారించారు. తాజాగా శుక్రవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను సిట్ అధికారులు విచారణకు పిలిచారు. దాదాపు ఏడు గంటల సేపు పలు రకాల ప్రశ్నలు వేసినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే, లోపల అధికారులు ఏం ప్రశ్నలు వేశారో గానీ, సాయంత్రం సిట్ కార్యాలయం నుంచి బయటకు వచ్చిన కేటీఆర్.. మీడియాతో పలు అంశాలను వెల్లడించారు.

**వీడిన ఉత్కంఠ!**

ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ ప్రారంభమైన నాటి నుంచి కేటీఆర్, హరీశ్ రావును ఏ క్షణంలోనైనా విచారణకు పిలుస్తారంటూ ప్రచారం కొనసాగుతూనే ఉంది. ఇదిగో రేపు, కాకపోతే మరుసటి రోజూ ఉంటూ ఉద్రిక్త

మిగతా 2వ పేజీలో...




# సీఎం పేరు లేకుండానే శిలాఫలకం!

- ప్రొటోకాల్ మరిచిన అధికారులు!
- ఎగేసుకుని శంకుస్థాపన చేసిన మంత్రి
- ఆఖరికి అధికారులపైనే మండిపాటు
- వనపర్తి జిల్లాలో చర్చనీయంశం

**మక్తల్ ప్రతినిధి, గవాక్షం :**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేరునే మరిచారు. సంక్షేమ కార్యక్రమాల ప్రారంభం, అభివృద్ధి పనుల శంకుస్థాపనల్లో సీఎం పేరు ఫస్ట్ రాస్తారు. కానీ, వనపర్తి జిల్లాలో అధికారులు ప్రొటోకాల్ విస్మరించారు. సీఎం పేరు లేకుండానే శిలాఫలకం సిద్ధం చేశారు. ఇవేమీ గమనించకుండానే మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సంఘటన సోషల్‌మీడియాలో చక్కర్లు కొట్టడంతో జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. వనపర్తి జిల్లా ఆత్మకూర్ మున్సిపల్ పరిధిలో శ్రీచెర్ల పరమేశ్వర స్వామి చెరువు కట్టపై అమృత్ 2.0 పథకం కింద రూ.3.14కోట్ల అంచనాతో రోడ్డు విస్తరణ–

మిగతా 2వ పేజీలో...



# సమ్మక్కకు రూ.3.70కోట్లు!

- మేడారం జాతరకు కేంద్రం భారీ సహాయం
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి చొరవతో మంజూరు

**న్యూఢిల్లీ- గవాక్షం :**

ఎట్టకేలకు మేడారం జాతరకు కేంద్రం భారీ సహాయాన్ని అందించింది. కేంద్ర ప్రభుత్వం రూ.3 కోట్ల 70 లక్షల నిధులను విడుదల చేసింది. గిరిజన కుంభ మేళాగా ప్రసిద్ధి చెందిన, ఆసియాలోనే అతిపెద్ద గిరిజన పండుగ అయిన మేడారం జాతరకు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి చొరవతో ఈ నిధులను విడుదల చేసింది. కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ, గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖలు సంయుక్తంగా నిధులు మంజూరు చేశాయి. రెండేళ్లకు ఒకసారి నిర్వహించే మేడారం జాతరకు దేశ వ్యాప్తంగా కోట్లాది మంది భక్తులు తరలివస్తుండటంతో.. భక్తులకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా ఈ నిధులను విడుదల

మిగతా 2వ పేజీలో...

# అవసరాలను భట్టి!

- బడ్జెట్ రూపకల్పనకు డిప్యూటీ సీఎం కసరత్తు
- నేటి నుంచి బడ్జెట్ సన్నాహక సమావేశాలు
- మంత్రులు, కార్యదర్శులు, శాఖాధిపతులతో భేటీ
- వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత శాఖల ప్రతిపాదనలపై చర్చ..



**హైదరాబాద్, గవాక్షం :**

నేటి నుంచి శాఖల వారీగా బడ్జెట్ సన్నాహక సమావేశాలు మొదలు కానున్నాయి. ఈ సమావేశాలకు ఆయా శాఖల మంత్రులు, కార్యదర్శులు, శాఖాధిపతులతో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆ రోజు నుంచి భేటీ కానున్నారు. ఇవాళ వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేతశాఖల ప్రతిపాదనలపై చర్చించనున్నారు. ఇక 21న రెవెన్యూ, గృహనిర్మాణం, ఐఅండ్‌పీఆర్, పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమం, వైద్య, ఆరోగ్య శాఖల సమావేశం ఉంటుంది. 22న ఆర్ అండ్ బీ, సినిమాటోగ్రఫీ, ఐటీ, పరిశ్రమల శాఖ ప్రతిపాదనలపై చర్చ ఉంటుంది. 26న నీటిపారుదల, పౌరసరఫరాలు, అటవీ, దేవాశాఖల సమావేశం.. 27న రవాణా, బీసీ సంక్షేమం, ఎక్సైజ్, టూరిజం శాఖల ప్రతిపాదనలపై చర్చలు

మిగతా 2వ పేజీలో...

# కావాలంటే ఇంకా రేషన్‌కార్డులు ఇస్తాం!

- మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ ప్రకటన
- బంజారాహిల్స్‌లో ఫంక్షన్ హాల్ ఓపెనింగ్
- మేయర్ గద్వాల తీపిగుర్తుగా అభివర్ణన
- మహిళలను కోటీశ్వరులను చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని వెల్లడి




**హైదరాబాద్, గవాక్షం :**

రేషన్‌కార్డులు అవసరమైన వారు దరఖాస్తు చేసుకుంటే అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అర్హులు ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చని మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ పేర్కొన్నారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పని చేస్తున్నదని తెలిపారు. బంజారాహిల్స్ రోడ్‌నంబర్ 12, ఎన్‌బీటీ నగర్‌లో రూ.8.50కోట్లతో నిర్మించిన మల్టీ పర్పస్ ఫంక్షన్‌హాలును జీహెచ్ఎంసీ మే–యర్ గద్వాల విజయలక్ష్మీతో కలిసి మంత్రి పొన్నం శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ మల్టిపర్పస్ ఫంక్షన్ హాల్

మిగతా 2వ పేజీలో...

# సమన్వయంతో జాతర సక్సెస్ చేద్దాం

**వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్**




**వరంగల్, గవాక్షం :**

మరి కొద్ది రోజుల్లో ప్రారంభం కాబోయే మేడారం సమ్మక్క సారలమ్మ జాతరను పు–రస్కరించుకొని వరంగల్ పోలీస్ కమిషనర్ ఆధ్వర్యంలో పోలీస్, ఆర్టీసీ అధికారులతో సమన్వయ సమావేశాన్ని శుక్రవారం వరంగల్ కమిషనరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ముందుగా గత జాతర సందర్భంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తిన ప్రాంతాలు,

మిగతా 2వ పేజీలో...

# కక్షగడితే బీఆర్ఎస్ నేతలు ఎప్పుడో జైలుపాలు!

- టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఘాటు వ్యాఖ్యలు
- చట్ట ప్రకారమే కేసుల్లో దర్యాప్తు ఉంటుందని వెల్లడి
- ఫోన్ ట్యాప్ చేయడానికి వ్యాపారులు తీవ్రవాదులా అంటూ ప్రశ్నల వర్షం

**హైదరాబాద్, గవాక్షం :**

తాము కక్ష సాధింపు రాజకీయాలు చేస్తే బీఆర్ఎస్ నేతలు జైల్లో ఉండేవారని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్కుమార్ గౌడ్ అన్నారు. చట్ట ప్రకారమే కేసుల దర్యాప్తు ఉంటుందని తెలిపారు. గతంలో ప్రతిపక్ష నేతలవే కాదు సొంత పార్టీ నేతల ఫోన్లనూ ట్యాప్ చేశారని ఆరోపించారు. హైదరాబాద్ భూములను ప్రైవేట్ వాళ్లకు అక్రమంగా కట్టబెట్టారని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో ఫోన్లు మాట్లాడాలంటే భయపడేవాళ్లమని వ్యాఖ్యానించారు. సింగరేణిలో అక్రమాలు ఎప్పుడు జరిగాయో తేటతెల్లంఅవుతుందన్నారు. "నక్సల్స్ వంకతో తన ఫోన్ ట్యాపింగ్ చేశారని అధికారులు చెప్పారు. నటులు, వ్యాపారులు ఏమైనా తీవ్రవాదులా.. ఎందుకు ట్యాప్ చేశారు. కవిత బయట పెట్టిన వాటికి ఆధారాలు ఇవ్వాలని కోరు తున్నా. 547 మంది ఫోన్లను ట్యాప్ చేశా రని అధికారులు చెబుతున్నారని తెలిపారు.

**బీఆర్ఎస్పై దయాకర్ తీవ్ర విమర్శలు**

జైలుకు వెళ్లాలని బీఆర్ఎస్ నేతలకు బాగా ఉబలాటంగా ఉందని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ ఎద్దేవా చేశారు. "తెలంగాణలో ఎన్నికలంటే డబ్బులు, ప్రలోభాలు ఉండాలనే విధంగా బీఆర్ఎస్ తయారు చేసింది అని అన్నారు.



# సింగరేణి బాగోతం చెప్పినందుకే నోటీసులు!

- సర్కారు తీరుపై బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు విమర్శలు
- రేవంత్‌రెడ్డివి డైవర్షన్ పాలిటిక్స్ అని మండిపాటు
- సోలార్ పవర్ టెండర్లలోనూ స్కాం జరిగిందని ఆరోపణలు
- ప్రజాక్షేత్రంలో శిక్ష తప్పదని ప్రభుత్వానికి హెచ్చరిక



2లో



# రౌడీ షీటర్ వెలివేత

- వరంగల్ కమిషనరేట్ పరిధి నుండి బహిష్కరణ
- ఆదేశాలు జారీ చేసిన సీపీ సన్‌ప్రీత్‌సింగ్

2లో




# వరంగల్‌లో అదే మేడారం బస్టాండ్!

2లో

శనివారం
24 జనవరి 2026
RNI No. TELTEL/2023/85185
తెలంగాణ గవాక్షం

# వరంగల్‌లో అదే మేడారం బస్టాండ్!




- ఇప్పుడున్న తాత్కాలిక ప్రాంగణం నుంచే సేవలు
- హన్మకొండ ఆర్టీసీ డిపోమేనేజర్ భూక్య ధరంసింగ్

**వరంగల్, గవాక్షం :**



వరంగల్‌లో ప్రస్తుతం తాత్కాలికంగా కొనసాగుతున్న బస్టాండ్ నుంచే మేడారం జాతరకు బస్సులు నడిపించనున్నట్లు హన్మకొండ ఆర్టీసీ డిపో మేనేజర్ భూక్య ధరంసింగ్ తెలిపారు. ఈనెల 25 నుండి ఫిబ్రవరి 1 వరకు ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. సుమారు లక్షకు పైగా ప్రయాణికులు వరంగల్ బస్ పాయింట్ నుండి జాతరకు ప్రయాణిస్తారని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. అందుకు అనుగుణంగా ఇక్కడి నుంచి 290 బస్సులు నడిపించనున్నట్లు తెలిపారు. అవసరమైతే మరిన్ని బస్సులు కూడా అందుబాటులోకి తీసుకొస్తామని పేర్కొన్నారు. ఇక వరంగల్ నుండి మేడారం వరకు పెద్దలకు రూ.250, పిల్లలకు రూ.150 టికెట్టు ధరలను నిర్ణయించినట్లు తెలిపారు. తెలంగాణకు చెందిన మహిళలు, ట్రాన్స్‌జెండర్లు సరియైన ధ్రువీకరణ పత్రాలు చూపించి మహాలక్ష్మి పథకం ద్వారా ఎక్స్‌ప్రెస్ బస్సుల వరకు ఉచితంగా ప్రయాణం చేయొచ్చన్నారు.

### 4 టికెట్ కౌంటర్లు

మేడారం జాతరకు తరలి వెళ్లే భక్తుల కోసం తాత్కాలిక బస్టాండ్‌లో నాలుగు టికెట్ కౌంటర్లు ఏర్పాట్లు చేసినట్లు డీఎం భూక్య ధరంసింగ్ తెలిపారు. ఈ కౌంటర్లు జాతర ముగిసే వరకు 24 గంటలు పనిచేస్తాయని పేర్కొన్నారు. జాతర విధుల్లో 800 మందికి పైగా ఉద్యోగులు పని చేయనున్నారని తెలిపారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికుల కోసం చలువ పందిళ్లు, తాగునీరు, పబ్లిక్ టాయిలెట్స్, తగు సూచనలను, సలహాలను అందించడానికి హెల్ప్ డెస్క్, ప్రత్యేక మెడికల్ క్యాంపు అందుబాటులో ఉంటాయని తెలిపారు.



## నర్వ గ్రామంలో డ్రైనేజీ పనులకు
# సర్పంచ్ భూమిపూజ

**మక్తల్ ప్రతినిధి, గవాక్షం :**

మక్తల్ నియోజకవర్గం నర్వ మండల కేంద్రంలో శుక్రవారం రోజు ఎస్సీ కాలనీ అనేక సంవత్సరాలుగా డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో కాలనీవాసులు అనేక ఇబ్బందులకు ఎదుర్కొనుచున్న విషయాన్ని గమనించి డాక్టర్ మంత్రి వాకిటి శ్రీహరి 20 లక్షల రూపాయలు ఎస్సీ సబ్ ప్లాన్ కింద డ్రైనేజీ నిర్మాణానికి ఆర్థిక అనుమతులు ఇవ్వడం జరిగింది. మంత్రి వాకిటి శ్రీహరి ఆదేశాలనుసారంతో నర్వ గ్రామ సర్పంచ్ టి హనుమంత్ రెడ్డి ముందుగా కంప చెట్లను తొలగించి డ్రైనేజి కి సంబంధించినటువంటి పనులు ప్రారంభించేందుకు పూజా కార్యక్రమం నిర్వహించి ప్రారంబించారు. వీరితోపాటు నర్వ గ్రామ ఉప సర్పంచ్ డి అజయ్,పంచాయతీ సెక్రెటరీ బుచ్చారెడ్డి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నర్వ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెన్నయ్య సాగర్ ఉపాధ్యక్షులు శరణప్ప ఆత్మకూరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ డి.కృష్ణారెడ్డి, డాక్టర్ శంకర్,వార్డు మెంబర్లు ఎం కురుమూర్తి ఎం హనుమంతు మాజీ కోఆప్షన్ సభ్యులు ఎండి ఫజల్, ఎం.డి. రఫిక్ ఎం నర్సింలు విశ్రీనివాసులు తిమ్మక్కల శ్రీనివాసులు పాల్గొన్నారు.



# సీఎం పేరు లేకుండానే శిలాఫలకం!

మొదటిపేజీ తరువాయి..

కాజ్‌వే బ్రిడ్జ్ నిర్మాణ పనులు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయి. ఆ పనుల శంకుస్థాపన కార్యక్రమానికి శుక్రవారం ముహూర్తం ఫిక్స్ చేశారు. మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. తీరా.. చూస్తే శిలాఫలకంపై సీఎం పేరు కనకపోవడం అందరినీ విస్మయానికి గురి చేసింది. సీఎం పేరు మాత్రమే రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పేరు చెక్కించడం కూడా విస్మరించారు. దీంతో మంత్రి వాకిటి శ్రీహరి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రిగానే కాదు, రేవంత్‌రెడ్డి మున్సిపల్ శాఖకు మంత్రిగా కూడా వ్యవహరిస్తుండడం గమనార్హం. మొత్తానికి ఈ వ్యవహారం ఎటువైపు దారి తీస్తుందోనని ఆందోళన నెలకొంది. సీఎం పేరు చెప్పడంలో తడబడినందుకే ఓ సినీ నటుడినే జైలుకు పంపించినట్లు ఆరోపణలు వెల్లువెత్తిన నేపథ్యంలో ఏకంగా ప్రభుత్వ అధికారులే సీఎం పేరు లేకుండా శిలాఫలకం ఆవిష్కరించడంపై సీఎం ఎలా స్పందిస్తారోనని ఉత్కంఠ నెలకొంది.



# సమన్వయంతో జాతర సక్సెస్ చేద్దాం

మొదటిపేజీ తరువాయి..

కారణాలతో పాటు, పోలీస్ మరియు ఆర్టీసీ సంయుక్తం తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు చర్చించుకున్నారు. ఈ సందర్భంగా మేడారం జాతర ఆర్టీసీ శాఖ చేసిన ఏర్పాట్లపై ఆర్టీసీ రీజినల్ మేనేజర్, విజయ భాను పోలీస్ కమిషనర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం పోలీస్ కమిషనర్ మాట్లాడుతూఎప్పటికప్పుడు మేడారం తరలి వస్తున్న భక్తుల రద్దీని గమనిస్తూ ట్రాఫిక్ అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాల్సి వుంటుందని, మేడారంకు వెళ్లే మార్గంలో బస్ నిలిపి వేసి ప్రయాణికులకు టికెట్లు జారీ చేయద్దని, గతంలో సమస్యలు సృష్టించిన డ్రైవర్ల విధుల్లోకి తీసుకోవద్దు, డ్రైవర్లకు తప్పనిసరిగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టాలి.ఒక వేళ బస్ బ్రేక్ డౌన్ అయితే రోడ్డుపై నిలిచిన పోయిన బస్ ను తక్షణమే మరమ్మత్తు చేసే విధంగా టెక్నీషియన్లను అందుబాటులో వుందే విధంగా క్యాంప్ లను ఏర్పాటు చేయాలని, బస్సులను రోడ్ల ఇరువైపులా నిలిపివేయవద్దని, బస్టాండ్ నుండి బయలుదేరే బస్సులు ఎక్కడ అగకుండా మేడారం బస్టాండ్ లో మాత్రమే బస్ ఆగుతుందని, కావును భక్తులు కాలకృత్యాలు తీర్చుకొని, తినుబండారాలు తమ తెచ్చుకోవాలని బస్టాండ్ లో అధికారులు విస్తృతం ప్రచారం చేయాలని సీపీ ఆర్టీసీ అధికారులకు వివరించగా, హన్మకొండ బాల సముద్రం నుండి జాతరకు వెళ్లే బస్సులకు ట్రాఫిక్ సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని. అదే విధంగా నగరంలో ఏదైనా ట్రాఫిక్ అంతరాయం కలిగితే జాతరకు వెళ్లే బస్సులను ప్రత్యామ్నాయ మార్గాల నుండి తరలించేందుకు తగు ఏర్పాట్లు చేసుకోవసింది గా పోలీస్ కమిషనర్ ట్రాఫిక్ అధికారులకు సూచించారు. ఈ సమావేశం లో డీసీపీలు అంకిత్ కుమార్, దార కవిత, ఆర్టీసీ , ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ ప్రభాకర్ రావు, ఏసీపీలు సత్యనారాయణ, జితేందర్ రెడ్డి, జానీ నర్సింహులు, ఆర్టీసీ డిప్యూటీ ఆర్. యం లు భాను కిరణ్, మహేష్, డిపో మేనేజర్లు రవి చందర్, అర్పిత,ధర్మాసింగ్, ట్రాఫిక్ ఇన్స్ స్పెక్టర్లు సీతా రెడ్డి, వెంకన్న, సుజాత ఇతర పోలీస్, ఆర్టీసీ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# రౌడీ షీటర్ వెలివేత

- వరంగల్ కమిషనరేట్ పరిధి నుండి బహిష్కరణ
- ఆదేశాలు జారీ చేసిన సీపీ సన్‌ప్రీత్‌సింగ్

**వరంగల్, గవాక్షం :**



శాంతి భద్రతల పరిరక్షణ పరిరక్షణలో మీల్స్ కాలనీకి చెందిన రౌడీషీటర్ వంచనగిరి సురేష్ ఏ కోతి సురేష్ ను వరంగల్ పోలీస్ కమిషనరేట్ నుండి బహిష్కరణ చేస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. తొలిసారిగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ప్రజా శాంతి, భద్రతలకు భంగం కలిగిస్తున్న రౌడీషీటర్ వంచనగిరి సురేష్ అలియాస్ కోతి సురేష్ పై హైదరాబాద్ సిటీ పోలీస్ చట్టం, 1348 ఫస్లి (వరంగల్ మెట్రోపాలిటన్ ఏరియా పోలీస్ చట్టం, 2015) లోని సెక్షన్ 26(1) ప్రకారం ఆరు నెలలు బహిష్కరణ ఉత్తర్వులు జారీ చేయబడ్డాయి. ఈ ఉత్తర్వుల జారీ అనంతరం మిల్స్ కాలనీ ఇన్‌స్పెక్టర్ రమేష్, ఎస్‌ఐ మిథున్ నిందితుడు కోతి సురేష్‌కు వరంగల్ పోలీస్ కమిషనరేట్ సరిహద్దులో సీపీ జారీచేసిన ఉత్తర్వులను అందజేశారు. మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్‌కు చెందిన వంచనగిరి సురేష్ రౌడీషీటర్‌గా గుర్తించబడిన వ్యక్తి కాగా, అతనిపై గతంలో పలు తీవ్రమైన నేర కేసులు నమోదై ఉన్నాయి. ఆయా కేసులు ప్రజలలో భయాందోళనలను సృష్టిస్తూ, శాంతియుత జీవన విధానానికి ఆటంకం కలిగించినట్లు పోలీసు రికార్డులు వెల్లడిస్తున్నాయి. ఇతని అక్రమ కార్యకలాపాల కారణంగా ప్రజలు ఫిర్యాదులు చేయడానికి కూడా భయపడుతున్న పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో, అతనికి కారణాలు చూపించాలని నోటీసు జారీ చేయగా, సంబంధిత అధికారుల ఎదుట హాజరుకాలేదు. ఎలాంటి వ్రాతపూర్వక వివరణ ఇవ్వకపోవడంతో, అతని వైఖరి ప్రజా శాంతికి ముప్పుగా మారిందని నిర్ధారణకు వచ్చారు. అందువల్ల, ప్రజా ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకుని, వంచనగిరి సురేష్‌ను వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధి నుంచి ఆరు (6) నెలల కాలానికి వెంటనే బయటకు వెళ్లాలని ఆదేశాలు జారీ చేయబడ్డాయి. కోర్టు హాజరు కోసం మాత్రమే ముందస్తు అనుమతితో కమిషనరేట్ పరిధిలోకి ప్రవేశించేందుకు అనుమతి ఇవ్వబడుతుంది. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని, ప్రజలు భయభ్రాంతులకు లోనుకాకుండా నేరాలపై సమాచారం అందించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# అవసరాలను భట్టి!

మొదటిపేజీ తరువాయి..

జరగనున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని శాఖల ప్రతిపాదనలపై 28 నుంచి వచ్చే నెల 1వ తేదీ వరకు ఆయా శాఖల ఉన్నతాధికారులతో చర్చించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల చేసిన ప్రకటనలకు అనుగుణంగా కొత్త పథకాలకు అవసరమైన నిధులు, వాటికి సంబంధించిన వివరాలను ప్రత్యేకంగా సిద్ధం చేయాలని ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అన్ని శాఖలకు స్పష్టం చేశారు. పూర్తిస్థాయి బడ్జెట్ రూపకల్పనలో భాగంగా ఆర్థిక శాఖ ఇప్పటికే అన్ని శాఖల నుంచి ప్రతిపాదనలు కోరారు. ప్రభుత్వానికి వచ్చే ఆదాయానికి సంబంధించి ఆయా శాఖల పనితీరు సూచికల ఆధారంగా నిర్దేశించిన లక్ష్యాల వివరాలు ఇవ్వాలని స్పష్టం చేసిన విషయం తెలిసిందే.

# అడిగిన ప్రశ్నలకు బదులిచ్చా..

మొదటిపేజీ తరువాయి..

లీకులు ఇస్తున్నారని అడిగితే సిట్ అధికారులు నీళ్లు నమిలారని తెలిపారు. కేసుకు సంబంధం లేని ప్రశ్నలు కూడా అడిగారని చెప్పారు. అయితే, విచారణలో తానొక్కడినే ఉన్నానని, మరెవరు.. ఏ రావూ లేదని కేటీఆర్ పేర్కొనడం గమనార్హం. ఇదిలా ఉండగా, కాంగ్రెస్ పార్టీ రెండేళ్ల అసమర్థ పాలన నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు కాలక్షేప కథాచిత్రాలు నడుపుతున్నదని కేటీఆర్ విమర్శించారు. సిట్ విచారణకు పూర్తిగా సహకరించినట్లు పేర్కొన్నారు. ఈ ప్రభుత్వం లీకు వీరుల ప్రభుత్వమని, కేవలం లీకుల మీద నడుస్తున్నదని ఎద్దేవా చేశారు. అడ్డగోలు లీకులను నమ్మి తప్పుడు వార్తలు ఇవ్వొద్దని మీడియా సంస్థలకు విజ్ఞప్తి చేశారు.

# ఓ పనైపోయింది!

మొదటిపేజీ తరువాయి..

వాతావరణం సృష్టించారు. చివరకు హరీశ్‌రావు, కేటీఆర్ విచారణ ముగియడంతో గులాబీ శ్రేణుల్లో నెలకొన్న ఉత్కంఠకు శుక్రవారంతో తెరపడింది. విచారణలో తర్వాత ఎవరనే అంశంపై చర్చ కొనసాగుతోంది. కేసీఆర్‌ను కూడా విచారణకు పిలుస్తారని ప్రచారం జరుగుతుండగా, ఇదే వేడిలో నోటీసులు ఇస్తారా? మరికొన్ని రోజులు వేచి చూస్తారా? అనేది వేచిచూడాల్సిందే.

# సమ్మక్కకు రూ.3.70కోట్లు!

మొదటిపేజీ తరువాయి..

చేసినట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది.కేంద్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో 'గిరిజన సర్క్యూట్' పథకం కింద ఇప్పటికే మేడారం పరిసర ప్రాంతాల్లో పర్యాటక అభివృద్ధి పనులు చేపట్టిన విషయం తెలిసిందే. ఈ పథకం కింద గతంలో సుమారు రూ.80 కోట్ల వ్యయంతో ములుగు, లక్నవరం, మేడారం, తాడ్వాయి, దామరవాయి, మల్లూరు, బొగత జలపాతం వంటి ప్రాంతాల్లో పర్యాటకులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, అభివృద్ధి పనులు కల్పించారు. రోడ్లు, వసతి సౌకర్యాలు, పర్యాటక సమాచార కేంద్రాలు, ఇతర సదుపాయాలు కల్పించడంతో ఈ ప్రాంతాలకు పర్యాటక ఆకర్షణ మరింత పెరిగింది. సమ్మక్క - సారలమ్మల జాతరగా ప్రసిద్ధి చెందిన మేడారం జాతర గిరిజన సంప్రదాయాలు, విశ్వాసాలకు ప్రతీకగా నిలుస్తోంది. ప్రతి జాతరతో భక్తుల సంఖ్య పెరుగుతుండటంతో కేంద్ర ప్రభుత్వం నిరంతరంగా సహకారం అందించడం గిరిజన సంస్కృతి పరిరక్షణకు తోడ్పడుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. యునెస్కో ప్రపంచ వారసత్వ హోదా పొందిన రామప్ప దేవాలయం అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం రూ.140 కోట్లను వెచ్చిస్తోంది. రామప్ప ఆలయం, మేడారం జాతర, పరిసర అటవీ ప్రాంతాలు అన్నింటినీ కలిపి తెలంగాణ గిరిజన, ఆధ్యాత్మిక పర్యాటకానికి ప్రత్యేక గుర్తింపునిచ్చేలా అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. అమ్మవార్లకు బంగారం(బెల్లం) సమర్పించి మొక్కులు తీర్చుకునేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి, పొరుగు రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు మేడారం జాతరకు తరలివస్తుంటారు. ఈ నేపథ్యంలో భక్తుల రవాణా సౌకర్యార్థం దక్షిణ మధ్య రైల్వే శాఖ జాతర జరిగే నాలుగు రోజుల పాటు 30 ప్రత్యేక రైళ్లను నడుపుతోంది. ఈ రైళ్ల ద్వారా తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల నుంచి భక్తులు సులభంగా మేడారం చేరుకునేలా ఏర్పాటు చేశారు.

# సింగరేణి బాగోతం చెప్పినందుకే నోటీసులు!

- సర్కారు తీరుపై బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు విమర్శలు
- రేవంత్‌రెడ్డివి డైవర్షన్ పాలిటిక్స్ అని మండిపాటు
- సోలార్ పవర్ టెండర్లలోనూ స్కాం జరిగిందని ఆరోపణలు

**హైదరాబాద్, గవాక్షం :**



సీఎం రేవంత్‌రెడ్డి బంధువు భూ కుంభకోణాన్ని ఆధారాలతో సహా బయటపెట్టామని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. ఆధారాలతో సహా బయటపెట్టేసరికి ప్రభుత్వానికి కంటిమీద కునుకు లేకుండా అయ్యిందని ఎద్దేవా చేశారు. తెలంగాణ భవన్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.కుంభకోణం ఎలా బయటకు వచ్చిందని వారంతా తలలు పట్టుకుంటున్నారని తెలిపారు. రెండేళ్లు దాటినా.. ఇంకా లీక్ రాజకీయాలే చేస్తారా? అని విమర్శించారు. రేవంత్ రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్కు ప్రజలు చరమగీతం పాడతారని వ్యాఖ్యానించారు. "సింగరేణిలో 107 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్లో పెద్ద కుంభకోణం జరిగింది. ఎంఎస్ఎంఈలు పాల్గొనకూడదని మూడింటికి కలిపి ఒకేసారి టెండర్లుపిలిచారు. సోలార్ పవర్ టెండర్ అనుమతులు కఠినం చేశారు. ప్రభుత్వం అనుకున్న వారికి టెండర్లు కట్టబెట్టేందుకు నిబంధనలు మార్చారు. దేశ వ్యాప్తంగా ఒక మెగావాట్ సోలార్ పవర్ ఉత్పత్తికి రూ. 3కోట్లు అవుతుంది. రాష్ట్రంలో మాత్రం ఒక మెగావాట్ సోలార్ ఉత్పత్తికి రూ.5.04 కోట్లు ఇచ్చారు. అదనంగా సింగరేణి భూములు కూడా ఇచ్చారు. సింగరేణిలో సోలార్ పవర్ ఉత్పత్తికి రూ.214 కోట్లు అదనంగా చెల్లించారు. సింగరేణిలో మరో సోలార్ పవర్ ప్లాంట్లోనూ స్కామ్ చేశారు. ఇంకో చోట 1 మె.వా సోలార్ ఉత్పత్తికి రూ. 7 కోట్లు కట్టబెట్టారు. బొగ్గు కుంభకోణాన్ని బీఆర్ఎస్ బయటపెట్టిన తర్వాతే కిషన్‌రెడ్డి సమీక్ష చేస్తున్నారు. సింగరేణిలో ఎక్స్‌ప్లోజివ్ కుంభకోణం కూడా జరిగింది. టెండర్లు వేసిన వారితో సీఎంబావమరిది హోటళ్లలో భేటీ అవుతున్నారు. బిడ్లను తెరిచే ప్రక్రియ ఐదారుసార్లు ఎందుకు వాయిదా పడుతోంది" అని హరీశ్ రావు ప్రశ్నించారు.

# కావాలంటే ఇంకా రేషన్‌కార్డులు ఇస్తాం!

మొదటిపేజీ తరువాయి..



మేయర్ గద్వాల విజయలక్ష్మీ పాలనాకాలానికి తీపిగుర్తుగా గుర్తుండిపోతుందని పేర్కొన్నారు. ఇంత పెద్ద ఫంక్షన్ హాల్ కట్టాలంటే అంత తేలిక కాదు.. హైదరాబాద్ పట్టణంలో ఖరీదైన స్థలంలో ఈ హాల్ నిర్మించడం.. మేయర్‌కు ప్రజల పట్ల ఉన్న అభిమానానికి తార్కాణమన్నారు. వసంతపంచమి రోజున ఫంక్షన్ హాల్‌ను ప్రారంభించుకోవడం శుభసూచికమన్నారు.

ఇంకా రేషన్ కార్డులు లేని వారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఇప్పుడు 100 శాతం సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామన్నారు. గుడిసె నుంచి బిల్డింగ్ వరకు అర్హులైన వారికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామన్నారు. ఇంకా 'మహిళలకు ఆర్టీసీ లో ఉచిత బస్సు ప్రయాణం అందిస్తున్నాం.. మహిళలకు వడ్డీలేని రుణాలు అందిస్తున్నాం..గ్రామాల్లో 18 సంవత్సరాల పైబడిన వారు మహిళా సంఘాల్లో ఉన్నారు. హైదరాబాద్ లో కూడా ప్రతి మహిళా మహిళా సంఘాల్లో చేరాలి. మిమ్మల్ని ఆర్థికంగా నిలదొక్కునేలా ఉపాధి అవకాశాలు మెరుగుపర్చడానికి ప్రత్యేక పథకాలు అమలు చేస్తున్నాం. ముఖ్యమంత్రి గారి ఆలోచనలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యం తో పని చేస్తున్నాం. నిన్న ఇదే ప్రాంతంలో పార్క్ ప్రారంభించుకున్నాం.. ఇంకా అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నాం. ముఖ్యమంత్రి గారి విజన్ తో హైదరాబాద్ అభివృద్ధి మరింత జరుగుతుంది. ఇంటర్నల్ రోడ్లు నిర్మిస్తున్నాం.. జీహెచ్‌ఎంసీలో మున్సిపల్ లు విలీనం చేసి అధికారులను ఏర్పాటు చేసి అభివృద్ధి వికేంద్రీకరణ చేస్తున్నాం. గత 10 సంవత్సరాల్లో హైదరాబాద్ నగరానికి ఒక చుక్క నీరు తేలేదు.. అప్పుడు 500 ఎంఎల్‌డీ వాటర్ ఉంటే వారు ఒక చుక్క అదనంగా నీరు తేలేదు.. ఇప్పుడు గోదావరి ఫేజ్ 2 నీళ్లు నగరానికి తెస్తున్నాం.. నగరానికి మా కాంగ్రెస్ ప్రభుత్వ హయంలోనే గోదావరి ,కృష్ణ ,సింగూరు నీళ్లు తెచ్చి నగర దాహార్తి తీర్చాం. ప్రజా పాలన ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి.. మీ ఆకాంక్షలు నెరవేరుస్తున్న ఈ ప్రభుత్వానికి అండగా ఉండండి. ఈ మల్టీఫంక్షన్ హాల్ నిర్మాణంలో ఎన్నో అవాంతరాలు ఎదురైన విజయ లక్ష్మీ అవాంతరాలు ఎదుర్కొని ఇది నిర్మించారు.. ' అని పేర్కొన్నారు.

RNI No. TELTEL/2023/85185
తెలంగాణ గవాక్షం



# కాంగ్రెస్‌కు కుట్రలు కొత్తకాదు!

- తెలంగాణ భవన్‌లో కేటీఆర్ భావోద్వేగ వ్యాఖ్యలు
- 20 ఏళ్లుగా రాష్ట్రం కోసం పని చేస్తున్నాని వెల్లడి
- సమైక్యవాదుల కుట్రలను ఛేదించి తెలంగాణ సాధించుకున్నాం
- కాంగ్రెస్ పార్టీ మా పైన కుట్రలు చేయడం కొత్త కాదు.
- రాష్ట్రాభివృద్ధికి శక్తివంచన లేకుండా పని చేసాం
- 10 సంవత్సరాల్లో అద్భుతమైన అభివృద్ధి సాధించాం
- ప్రస్తుత పరిణామాలు బాధ కలిగిస్తున్నాయని ఆవేదన

**హైదరాబాద్, గవాక్షం :**
రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులు ఆవేదనకు, ఆందోళనకు దారితీస్తున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. వ్యవసాయ సంక్షోభం నుంచి అన్ని రంగాల్లో వ్యవస్థలు అస్తవ్యస్తంగా తయారయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు, నేతన్నలు ఆత్మహత్య చేసుకోవడం విచారకరమన్నారు. విద్యార్థుల కష్టాలు, నిరుద్యోగుల నిరసనలు ఆవేదన కలిగిస్తున్నాయని మథనపడ్డారు. శుక్రవారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో ఉద్వేగపూరితంగా ప్రసంగించారు. 'టైం పాస్ రాజకీయాలు చేయలేదు. ప్రత్యర్థులను ప్రతిపక్ష నేతలను వారి కుటుంబాలను ఏనాడు రాజకీయాల్లోకి లాగలేదు, అక్రమ కేసులు పెట్టి వేధించలేదు. కానీ గత అయిదారు సంవత్సరాలుగా నా పైన తీవ్రమైన దుష్ప్రచారం కాంగ్రెస్ పార్టీ చేసింది. డ్రగ్స్ కేసులో హీరోయిన్లతో సంబంధాలు అంటూ నన్ను అనేక అంశాల్లో ఇరికించాలని చూశారు. నన్నే కాకుండా నా కుటుంబాన్ని నా పిల్లలను కూడా మానసిక క్షోభకు గురి చేసారు. అయినా నేను ఎవరికీ భయపడలేదు, ఇప్పుడు ఫోన్ ట్యాపింగ్ అంశంలోనూ ఎవరి కుట్రలకు భయపడేదే లేదు. ఫోన్ ట్యాపింగ్ విషయంలో నన్ను విచారణకు పిలిచారు, నేను వెళ్తాను, నేను వారిని కొన్ని ప్రశ్నలు అడగదలచుకున్నాను. గత రెండు సంవత్సరాలుగా ఒక డైలీ సీరియల్ మాదిరి లీకులు ఇస్తూ నా వ్యక్తిత్వ హననం చేస్తున్న వాటికి ఒక్క సాక్ష్యం అయినా ఉన్నదా? కేవలం మీడియా లీకులే తప్పించి ఒక్క అధికారిక సాక్ష్యం లేకుండా ఎందుకు దుష్ప్రచారం చేస్తున్నారు అని అడుగుతాను. ఈ రాష్ట్రంలో టెలిఫోన్ ట్యాపింగ్ జరగడం లేదని ఒక్క పోలీస్ అధికారయినా చెబుతారా అని అడుగుతాను. రాష్ట్రంలో టెలిఫోన్ ట్యాపింగ్ జరగడం లేదు అని డీజీపీ శివధర్ రెడ్డి ముందుకు వస్తాడా? సజ్జనార్ ముందుకు వస్తాడా? ఇంటెలిజెన్స్ ఐజీ ముందుకు వస్తాడా? అని అడుగుతాను. కేవలం మా పార్టీ బయట పెట్టిన సింగరేణి బొగ్గు స్కామ్ నుంచి అటెన్షన్ డైవర్షన్ చేయడం కోసమే ఈ టెలిఫోన్ ట్యాపింగ్ డ్రామాను రేవంత్ రెడ్డి నడిపిస్తున్నాడు. ఆయన బామ్మర్ది కేంద్రంగా వేల కోట్ల రూపాయల బొగ్గు గనుల స్కామ్ జరిగింది. దీనిపైన కేంద్రం ఇప్పటిదాకా స్పందించలేదు. ఎవరికీ భయపడకుండా తలవంచకుండా నికార్సైన తెలంగాణ బిడ్డలుగా కొట్లాడుతాము. కేసీఆర్ సైనికులుగా కేసీఆర్ ను తిరిగి ముఖ్యమంత్రి చేసే దాకా కలిసికట్టుగా పని చేస్తాము. సంఘీభావం చెప్పడానికి వచ్చిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు. కాంగ్రెస్ పార్టీ వైఫల్యాల పైన రేవంత్ రెడ్డి అవినీతి పైన 100 శాతం ప్రాణం పోయే దాకా పోరాడుతూనే ఉంటాము. అటెన్షన్ డైవర్షన్ గేమ్ లు ఆడినా అర్జునుడి కన్ను మాదిరి రేవంత్ రెడ్డి అవినీతి పైన కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలు పైననే మా పోరాటం ఉంటుంది..' అని పేర్కొన్నారు.



## ఉత్సాహంగా సీఎం కప్ పోటీలు

**మహబూబ్‌నగర్, గవాక్షం :**



చిన్నచింతకుంట మండల కేంద్రంలో సీఎం కప్ పోటీలను ఎంఈవో మురళి కృష్ణ ప్రారంభించారు. చిన్నచింతకుంట మండలంలోని తొమ్మిది గ్రామాల నుంచి క్రీడాకారులు ఈ పోటీలకు హాజరయ్యారు. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పోటీపడ్డారు. కార్యక్రమంలో జిల్లా స్పోర్ట్స్ యూత్ ఆఫీసర్ శ్రీనివాసులు,మానస దశరథ, ఉపసర్పంచ్ భూలక్ష్మి, తహసిల్దార్ సి.ఎల్లయ్య, ఎంపీడీవో లక్ష్మి నరసింహ, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ కవిత, జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ రాకేష్, బురాన్, వార్డు సభ్యులు యాకూబ్, దేవీ సంతోషి, పాఠశాల ఇన్చార్జి హెచ్ఎం శ్రీనివాసులు, పిఈటి రఘు, పంచాయతీ సెక్రెటరీ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.





## రైతుల సమస్యలపై దత్తాత్రేయకు వినతి

**మేడ్చల్, గవాక్షం :**
రైతుల సమస్యలపై మేడ్చల్ జిల్లా, దుండిగల్ సర్కిల్, బౌరంపేట్ గ్రామంలో రైతులతో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ సమావేశం నిర్వహించారు. వారి సమస్యలను ఆలకించి, వినతి పత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ ఉద్దేశించి మాట్లాడుతూ గ్రామ పంచాయతీలు జిహెచ్ఎంసిలో విలీనం చేయడం వల్ల రింగ్ రోడ్డు లోపల ఉన్న గ్రామాల జన జీవనం అస్తవ్యస్తంగా మారిందన్నారు. ఈ విలీనం అశాస్త్రీయం అన్నారు. అదేవిధంగా ఎవీణూ పరిధిలో కన్జర్వేషన్/రిక్రియేషన్ తదితర జోన్ల వల్ల రైతులకు శాపంగా మారిందని, సామాన్య, సన్న, చిన్నకారు రైతులే ఎక్కువగా నష్ట పోతున్నారని అన్నారు. త్వరలో ముఖ్యమంత్రిని ఈ సమస్యల పై కలిసి కచ్చితమైన పరిష్కారం కోరుతానని, ప్రభుత్వం స్పందించని యెడల 50 వేల మందిరైతులతో ఉద్యమ రూపంలో ప్రభుత్వం పై వత్తిడి తెచ్చి ప్రభుత్వం పై వత్తిడి తెచ్చి రైతుల హక్కులు సాధించుకుందామని దత్తాత్రేయ పిలుపునిచ్చారు. 70 ఏండ్ల నుండి పేద రైతుల అదీనంలో ఉన్న లావాణి పట్టాలు, వారి భూములు ప్రభుత్వం లాక్కోవడం తగదన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు, సర్వీస్ రోడ్డు నుండి రైతులు తమ సొంత పొలంలోకి వెళ్లడానికి కూడా దారి ఇవ్వకుండా హెచ్ఎండి అధికారులు రైతులను అడ్డుకుంటున్నారని, ఇది దారుణం అని పేర్కొన్నారు. ఈ సమస్యపై స్పందించి రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకొని రైతులకు న్యాయం చేయాలని కోరడం జరిగింది.ఇది అందరి సమస్య అని, అన్ని పార్టీలను కలుపుకొని ముందుకు సాగుదాం అని, త్వరలో ముఖ్యమంత్రిని కలిసి సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేస్తానని తెలిపారు. కార్యక్రమం లో బౌరంపేట్ మాజీ సర్పంచ్ లు డా ఎస్ మల్లారెడ్డి,అర్కల వీరేశం గౌడ్, కొమ్ము మంగమ్మ గారు, మాజీ ఎంపీటీసీలు ఎస్ జంగారెడ్డి, రైతు నాయకులు శ్రీ కళ్లెం బాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా రైల్వే మిక్స్‌డ్ హైస్కూల్ వార్షికోత్సవం

**హైదరాబాద్, గవాక్షం :**
సౌత్ లాలా గూడలోని రైల్వే మిక్స్‌డ్ హై స్కూల్ శుక్రవారం తన వార్షిక దినోత్సవ వేడుకలను నిర్వహించింది. ఈ కార్యక్రమానికి దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దక్షిణ మధ్య రైల్వే మహిళా సంక్షేమ సంస్థ (ఎస్.సి.ఆర్.డబ్ల్యూ.డబ్ల్యూ.ఓ) అధ్యక్షురాలు వందన శ్రీవాస్తవ; దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ పర్సనల్ ఆఫీసర్ శ్రీ సిద్ధార్థ్ కటి; హైదరాబాద్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ శ్రీ సంతోష్ కుమార్ వర్మ; ఎస్.సి.ఆర్.డబ్ల్యూ.డబ్ల్యూ.ఓ హైదరాబాద్ డివిజన్ అధ్యక్షురాలు శ్రీమతి ఆశా వర్మ; హైదరాబాద్ డివిజన్ సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్ శ్రీ కట్టా ఆనంద్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రైల్వే మిక్స్‌డ్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు శ్రీ చిదంబరం విజయ రాజుతో పాటు సిబ్బంది, విద్యార్థులు కూడా పాల్గొన్నారు. ఈ కార్యక్రమం రంగురంగుల బ్యాండ్ ప్రదర్శన, ఉత్సాహ భరితమైన రంగోలి మరియు అలంకార మెహందీతో ప్రారంభమైంది. ప్రాథమిక మరియు ఉన్నత పాఠశాల విభాగాల విద్యార్థుల ఉత్సాహభరితమైన సాంస్కృతిక ప్రదర్శనలు గొప్ప సాంస్కృతిక వైవిధ్యాన్ని ప్రతిబింబించాయి మరియు ప్రేక్షకుల నుండి గట్టిగా చప్పట్లు మరియు భారీ ప్రశంసలతో స్వీకరించబడ్డాయి. ఈ సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ శ్రీ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ మాట్లాడుతూ, నేటి విద్యార్థులే భవిష్యత్తులో భారతదేశ బాధ్యతాయుతమైన పౌరులని అన్నారు. నైతిక విలువలు, క్రమశిక్షణ, క్రీడలు మరియు సాంస్కృతిక కార్యకలాపాలతో విద్యను సమతుల్యం చేయడం ద్వారా మొత్తం శ్రేష్ఠతకు కృషి చేయాలని ఆయన విద్యార్థులకు సూచించారు. విద్యార్థులందరికీ ఆయన శుభాకాంక్షలు తెలిపారు మరియు ఉజ్వల భవిష్యత్తును రూపొందించడానికి పాఠశాల అందించే సౌకర్యాలను గరిష్టంగా ఉపయోగించుకోవాలని పిలుపు నిచ్చారు.



## ప్రభుత్వ అసమర్ధతోనే వరద కాలువల పనులు నిలిపివేత

### పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి విమర్శలు

**వరంగల్ - గవాక్షం :**
వరంగల్ జిల్లా గీసుకొండ మండలంలోని కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్ వరద కాలువలు బలోపేతం చేయడం అనే అత్యంత కీలకమైన పనులను కాంగ్రెస్ ప్రభుత్వం అర్థాంతరంగా నిలిపివేయడం దురదృష్టకరమని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తీవ్రంగా విమర్శించారు. ఈ పనులకు పరిశ్రమల శాఖ ద్వారా జీఓ నెం.167 ప్రకారం రూ.160.92 కోట్ల పరిపాలనా ఆమోదం ఇచ్చి, టెండర్లు ఆహ్వానించి పనులు కూడా ప్రారంభించారని గుర్తు చేశారు. వర్షాకాలంలో వరద ముంపును నివారించేందుకు అత్యంత అవసం-మైన ఈ ప్రాజెక్టు గత రెండు వర్షాకాలాల్లో టెక్స్టైల్ పార్క్ పూర్తిగా మునిగిపోవడంతో మరింత ప్రాధాన్యత సంతరించుకుందని తెలిపారు. భవిష్యత్తులో భారీ వర్షాలు కురిస్తే పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని, ఇప్పటికే పరిశ్రమల సిబ్బంది వరదల భయంతో ఆందోళన చెందుతున్నారని, కొత్తగా పరిశ్రమలు రావాలంటే భయపడుతున్నాయని పేర్కొన్నారు. ఇలాంటి సమయంలో పనులను నిలిపివేయడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి, అసమర్థతకు అద్దం పడుతోందని మండిపడ్డారు. ఇప్పటివరకు ఎమ్మెల్సీ శీట కాలువల చ్యూఎశీబత్ వివరాలు అందించకపోవడం వల్లనే పనులు ఆగిపోయాయని చెప్పడం కాంగ్రెస్ ప్రభుత్వ చేతకానితనానికి నిదర్శనమని విమర్శించారు. "గత ఏడాది గొప్పలకు వెళ్లి, టెండర్ పేరుతో ప్రా-జెక్టులకు శంకుస్థాపనలు చేసి, ఇప్పుడు ఫండ్స్ లేవని పనులు ఆపేసే ప్రభుత్వాన్ని ప్రజలు చూస్తున్నారు" అని అన్నారు. టెక్స్టైల్ పార్క్?లో జరిగిన ఈ ఘటన కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ పాలనకు ప్రత్యక్ష ఉదాహరణ అని వ్యాఖ్యానించారు. పరిశ్రమల భద్రత, వేలాది కార్మికుల ఉపాధి, ప్రాంత అభివృద్ధిని తాకట్టు పెట్టే విధంగా వ్యవహరించడం సరికాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇకనైనా కళ్లుతెరచి, వెంటనే నిధులు విడుదల చేసి, వరద కాలువల బలోపేత పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని, లేదంటే పరిశ్రమల భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టిన బాధ్యత ప్రభుత్వానిదే అవుతుందని చల్లా ధర్మారెడ్డి హెచ్చరించారు.

**యంగ్ వన్ కంపెనీని సందర్శించిన ధర్మారెడ్డి..**
కాకతీయ మెగా వస్త్ర పరిశ్రమలో ఉన్న యంగ్ వన్ కంపెనీని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా కంపెనీ యాజమాన్యంతో కలిసి పరిశ్రమలో కొనసాగుతున్న ఉత్పత్తి ప్రక్రియలు, కార్మికులకు కల్పిస్తున్న సదు-పాయాలు, ఉపాధి అవకాశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.పార్కు ఏర్పాటు కోసం భూములు ఇచ్చిన కుటుంబాలకు, స్థానికులకు ఉపాధి అవకాశాలలో మొదటి ప్రాధాన్యత కల్పించాలని యాజమాన్యాన్ని కోరారు.



## 'బంగారు తెలంగాణ' క్యాలెండర్ ఆవిష్కరణ

**మహబూబ్‌నగర్, గవాక్షం :**
బంగారు తెలంగాణ రియల్ ఎస్టేట్స్ మార్కెటింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ మహబూబ్నగర్ జిల్లా క్యాలెండర్ను ఆవిష్కరించిన రాష్ట్ర అధ్యక్షులు ముహమ్మద్ అన్సార్ హుస్సేన్. మహబూబ్నగర్ పట్టణం శ్రీరామ కాలనీలో గల బంగారు తెలంగాణ రియల్ ఎస్టేట్స్ మార్కెటింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో జిల్లా కార్యవర్గము ఏర్పాటు చేసిన మహబూబ్నగర్ జిల్లా క్యాలెండర్ ఆవిష్కరణ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు ముహమ్మద్ అన్సర్ హుస్సేన్ గారు ముఖ్యఅతిథిగా పాల్గొని క్యాలెండర్ ను ఆవిష్కరించడం జరిగింది తదనంతరం సమావేశాన్ని ఉద్దేశిస్తూ మాట్లాడుతూ మహబూబ్నగర్ కార్యవర్గ సభ్యులు గత సంవత్సరంలో రియల్ ఎస్టేట్స్ సమస్యలను పరిష్కరించడంలో ఎంతో క్రియాశీలకంగా వ్యవహరించారని ఈ సంవత్సరం కూడా రెండు మూడు కంపెనీలకు సంబంధించి మేజర్ సమస్యలు మన దృష్టికి వచ్చాయని వాటిని సూపర్డెంట్ ఆఫ్ పోలీస్ మరియు కలెక్టర్ గారి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి ద్విగుణ ఉత్సాహంతో కార్యవర్గం ప్రయత్నిస్తుందని ఇప్పుడు కార్యవర్గంలో యువకులు ఎంతో చురుకుగా ఉత్సాహంగా పనిచేస్తున్నారని తెలిపారు. త్వరలోనే ఉత్తమ ప్రతిభ కనబరిచిన కార్యవర్గ సభ్యులకు రాష్ట్రస్థాయిలో ఉత్తమ రియాల్టర్ అవార్డులను అందజేయడం జరుగుతుందని తెలియజేశారు. కొత్తగా ఎన్నికైన సంఘం సభ్యులు ఉమ్మడి జిల్లా కన్వీనర్ జనార్దన్ రెడ్డిని, కో కన్వీనర్ సంధ్య శివ లీలను మరియు పట్టణ ప్రధాన కార్యదర్శి వెంకటస్వామిని, రవీందర్‌ని రాష్ట్ర అధ్యక్షులు శాలువాతో సన్మానించారు. జిల్లా అధ్యక్షులు బాబు నాయక్ మాట్లాడుతూ రియల్ ఎస్టేట్ సమస్యల కొరకై అన్ని జిల్లాలతో పోటీపడి మహబూబ్నగర్ జిల్లాను ప్రథమ స్థానంలో నిలబెట్టడానికి మా కార్యవర్గ సభ్యులతో కలిసి శాయాక్షక్తుల ప్రయత్నిస్తానని చెప్పరు. కార్యక్రమంలో ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా కోకన్వీనర్ సంధ్యా శివ లీల, కోర్ కమిటీ సభ్యులు భాస్కర్ రెడ్డి, భాను ప్రతాప్, కురుమూర్తి, మహబూబ్ అలీ, శివారెడ్డి, చంద్రశేఖర్, పట్టణ ఉపాధ్యక్షుడు పట్టణ ప్రధాన కార్యదర్శి వెంకటస్వామి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చికిర్యాల ఉపాధ్యక్షులు జయ ప్రకాష్, రవీందర్, శ్రీనివాస్, సలహాదారులు విజయ్ కుమార్, రఫీక్, నజీర్, కార్యవర్గ సభ్యులు చిరంజీవి, వెంకటేష్, రహమత్, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

